ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం

అట్టహాసంగా విజయ దశమి

భద్రాచలం, న్యూస్‌టుడే



జిల్లాలో విజయదశమి సంబరాలు అంబరాన్నంటాయి. దసరా వైభవం భద్రాచలం పుణ్యక్షేత్రంలో సాక్షాత్కరించింది. ఈనెల 4న ఆరంభమైన ఉత్సవాలకు శనివారం పూర్ణాహుతి పలికారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీరామ మహా పట్టాభిషేకం కొనసాగించారు. రామాయణ పారాయణం పూర్తిచేసి హోమం నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయం నుంచి బయల్దేరిన రాములవారు రాజవీధి నుంచి తిరువీధికి వేంచేసి అడుగడుగునా పూజలు అందుకున్నారు. మండపంలో శమీ పూజలు చేశారు. స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకుడు విజయరాఘవన్ నేతృత్వంలో వైదిక పెద్దలు జమ్మిచెట్టుకు పసుపు, కుంకుమలు పూసి ప్రణమిల్లారు. మంత్రోచ్చారణ మధ్య గద, డాలు, కత్తి, శంఖు చక్రాలు, బరిసె, ధనుర్బాణాలకు ఆయుధ పూజ చేశారు.


రావణ దహనం


శమీపూజ చేస్తున్న అర్చకులు

కిక్కిరిసిన మండపం..

దసరా మండప ప్రాంగణంలో శ్రీరామ లీలా మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పది తలల రావణాసురుడి బొమ్మను దహనం చేశారు. అగ్ని బాణాన్ని ఈఓ రమాదేవి వదిలి రావణ వధ ఘట్టం ఆరంభించారు. రావణుడి దహనం సమయంలో జైశ్రీరాం అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తజనం తరలి మండపం కిక్కిరిసింది.


భద్రాచలం వేడుకల్లో అలరించిన నృత్య ప్రదర్శన


భద్రాచలంలో భక్తుల సందడి


ఇల్లెందు నం.2 బస్తీ శ్రీకృష్ణ భజనమందిర రథంపై అమ్మవారు..

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

దసరా వేడుకల్లో ఇల్లెందు ‘మినీ మైసూరు’ను తలపించింది. విజయ దశమి వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. స్థానికే జేకే కాలనీలోని సింగరేణి క్రీడా మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ జానీ, కౌన్సిలర్లు, డీఎస్పీ చంద్రభాను తదితరులు పాల్గొన్నారు. ఈటీవీ జబర్దస్ ఇమాన్యుయేలు, నూకరాజు, ఫైమా బృందంతో పాటు హైదరాబాద్‌కు చెందిన నృత్య, మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. ఎమ్మెల్యే, ఎంపీ, పలువురు నాయకులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. వేడుకలకు ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రావణవధ కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. రద్దీని డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో క్రమబద్ధీకరించారు.


వేడుకల్లో బలరాంనాయక్, కోరం, డీవీ కేరింతలు

కొలువుదీరిన కోటమైసమ్మ



కారేపల్లి, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో ఐదు రోజులపాటు సాగే శ్రీకోటమైసమ్మ జాతర శనివారం అంగరంగ వైభవంగా మొదలైంది. కొలిచిన వారికి కొంగుబంగారమిస్తుందనే నమ్మకంతో అమ్మవారి సన్నిధికి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కోటమైసమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ప్రధాన ద్వారం మొదలు ఆలయం వరకు వాహనాలు స్తంభించాయి. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్ ఆధ్వర్యంలో 120 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఇల్లెందు: సింగరేణి మైదానంలో బాణసంచా మెరుపులు



ఇల్లెందు: ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అరచేతిలో పత్తి కొనుగోళ్ల సమాచారం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఈ సీజన్‌లో పత్తి పంట చేతికొస్తోంది. మరో వారంలో విక్రయాలు మొదలుకానున్నాయి. తెల్ల బంగారాన్ని విక్రయించాలంటే గతంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించేవారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతు ఎప్పుడు పత్తి తీసుకెళ్లాలనే సమాచారం నుంచి నగదు జమ వరకు సకల వివరాలు దీని ద్వారా తెలుసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో పత్తి ప్రధాన పంటగా సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సీసీఐ అధికారులు ‘వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్’ సంస్థ ఆధ్వర్యంలో ‘వాట్సాప్’ సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు అనుసంధానించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సీసీఐ కేంద్రాల కొనుగోళ్ల తాజా వివరాలను యాప్ ద్వారా అందుబాటులో ఉంచుతారు.



భద్రాద్రి జిల్లా సీసీఐ కేంద్రాలివే..

- మంజీత్ కాటన్ ప్రైవేటు లిమిటెడ్, సుజాతనగర్
- శ్రీరామా కాటన్ ఇండస్ట్రీస్, అశ్వాపురం
- అనుశ్రీ కాటన్ ఇండస్ట్రీస్, బూర్గంపాడు
- శ్రీలక్ష్మీప్రియ కాటన్ ఇండస్ట్రీస్, సింగరేణి

ఏమిటీ ప్రయోజనం?

- వానాకాలం సీజన్‌లో పత్తి రైతులు, దిగుబడి అంచనా వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు నమోదు చేశారు. ఆ సమాచారాన్ని సీసీఐ కేంద్రాలకు అందజేశారు. వ్యవసాయ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకున్న రైతులకు యాప్‌ను ప్రత్యేక ఫోన్ నంబరుతో అందుబాటులో తెస్తున్నారు.
- రైతులు తమ వద్ద ఎంత పత్తి దిగుబడి ఉంది? అనే వివరాలను తొలుత వాట్సాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు స్థానికి సీసీఐ/జిన్నింగు మిల్లు పరిధిలో కొనుగోలుకు ఎంత సమయం పడుతుందో సమాచారం అందుతుంది.
- సీరియల్‌లో ఉన్న వాహనాల సంఖ్య, లోడింగ్, అన్‌లోడింగ్ వివరాలు ప్రత్యక్షం అవుతాయి.
- సరకు విక్రయించిన తర్వాత తక్‌పట్టీ వివరాలు, ధరల వివరాలు, నగదు ఎన్ని రోజుల్లో జమ అవుతుందో స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. వివరాలు తెలుగు, హిందీ, ఆంగ్లంలో తెలుపుతారు.
- ఒకసారి పంట విక్రయించిన రైతులు.. తదుపరి చేతికందే పత్తి అంచనాను సైతం వాట్సాప్‌లో పొందుపరచవచ్చు. తద్వారా అధికారులకు కొనుగోళ్లపై ఓ అంచనా ఉంటుంది.

రైతులకు అరచేతిలో తాజా సమాచారం

పత్తి కొనుగోళ్ల తాజా సమాచారం యాప్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తుంది. జిన్నింగ్ మిల్లులో ఎన్ని వాహనాలు ఉన్నాయి? తమ సీరియల్ ఎప్పుడ వస్తుందో కూడా ఫోన్ ద్వారా తెలుసుకునే సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. రైతు తన సరకును ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకుని వెంటనే అమ్ముకునే సౌలభ్యం కలుగుతుంది. నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలి.

- ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం

పరమానందభరితం.. రాములోరి అభిషేకం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించి అభిషేక మహోత్సవం చేశారు. ఆ సమయంలో సాగిన మంత్రోచ్చారణ భక్తులను మంత్రముగ్ధులను చేసింది. బంగారు పుష్పార్చన అలరించింది. భద్రాద్రి దర్శనం పరమ పావనమని సుభాషించారు. విష్వక్సేనుల వారిని ఆరాధించి పుణ్యాహవాచనం చేశారు. గోత్రనామాలను చదివారు. కల్యాణ క్రతువును వివరిస్తూ సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ గావించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక భక్తి భావాలను పంచాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రధాన కోవెలలో మూలవిరాట్‌తో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వచనం పొందారు. సర్వ ఏకాదశి సందర్భంగా రాములవారికి పవళింపు సేవ నిర్వహించలేదు. సోమవారం ముత్తంగి రూపంలో రామయ్య దర్శనం ఉంటుందని తెలిపారు.

రామవరంలో విమానాశ్రయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెంలోని రామవరం సాధన గ్రౌండ్స్ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషిచేస్తున్నామని, త్వరలో పూర్తిస్థాయి నిర్ణయం వెలువడుతుందని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సింగరేణి కార్పొరేట్ ఏరియా పరిధిలో రైటర్‌బస్తీలో, ఏరియా పరిధిలో రామవరంలోని దుర్గామాత దేవాలయంలో దసరా సందర్భంగా శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్‌తో కలిసి రామవరం ప్రాంతాన్ని సందర్శించానని.. విమానాశ్రయం ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందన్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఈ ఏరియా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, గుర్తింపు సంఘం నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, కమిటీ సభ్యుడు రమేష్, కాంగ్రెస్ నాయకుడు నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పాపికొండల పర్యాటక బుకింగ్ ప్రారంభం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పాపికొండల ప్రకృతి అందాలను తిలకించేందుకు బోటు బుకింగ్ దసరా నుంచి ప్రారంభమైంది. భద్రాచలం నుంచి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పోచారం వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి గోదావరి నదిలో లాంచీలో వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకు గాను టిక్కెట్ ధర పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750గా ఉంది. సొంత వాహనం లేకుంటే నిర్వాహకులే వాహనాన్ని ఏర్పాటు చేసి మనిషికి మరో రూ.300 అదనపు ధర వసూలు చేస్తున్నారు. సొంత వాహనం ఉంటే ఇది చెల్లించాల్సిన అవసరం ఉండదు.

దిగుమతి సుంకం పెంపుదలకు తుమ్మల కృషి: భట్టి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ముడిచమురు దిగుమతులపై సుంకం పెంచేందుకు కేంద్ర మంత్రిని ఒప్పించడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కొనియాడారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో రూ.36.5కోట్లతో నిర్మించిన టర్బైన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా భట్టి శనివారం హాజరయ్యారు. త్వరలో రాష్ట్రంలో నూతన విద్యుత్తు విధానం ద్వారా సోలార్, హైడ్రో, ఇతర విధాలుగా గ్రీన్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో రైతుల పంపుసెట్ల వద్దనే సోలార్ ప్యానెల్స్ పెట్టి వాటిని గ్రిడ్‌కు అనుసంధానిస్తామన్నారు. రైతు వాడుకోగా మిగులే విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతుల ఆత్మగౌరవం పెంచే దిశగా రైతుబీమా, పంటల బీమా పథకాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేలా ఏర్పాటు చేయనుందని ప్రకటించారు. ఆయిల్‌పాం సాగును అన్ని జిల్లాలకు విస్తరిచనున్నటు భట్టి పేర్కొన్నారు.

త్వరలో దిల్లీకి బృందం.. తుమ్మల: టన్ను ఆయిల్‌పాం గెలలకు రూ.20వేల స్థిరమైన ధర సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మంత్రులు, రైతుసంఘ ప్రతినిధులతో దిల్లీ వెళ్లనున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం లేనివారికీ ఆయిల్‌పాం మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

★ ప్రస్తుతం ఏ పంటకూ లేని గిట్టుబాటు ధర, స్థిరమైన మార్కెట్ ఉన్న ఏకైక పంట ఆయిల్‌పాం అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతును రాజుగా నిలబెట్టే పంట ఆయిల్‌పాం అని పేర్కొన్నారు. సొంత విద్యుత్తు ఉత్పాదనతో ఆయిల్‌ఫెడ్ నూతన అధ్యాయానికి తెరతీసిందన్నారు.

★ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా చూస్తే ఆయిల్‌పాం విస్తీర్ణం రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని.. 76 శాతం తోటలు ఈ నాలుగేళ్లలోనే విస్తరించాయన్నారు. 70 శాతం తోటలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఉన్నాయన్నారు. త్వరలోనే రైతులకు మొక్కలతో పాటు బిందుసేద్యం పరికరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, మహబూబాబాదు ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, రాందాసు నాయక్, నీటిపారుదల అభివృద్ధి ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఐడీసీ సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, తెలంగాణ ఆయిల్‌పాం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాదు, జూపల్లి రమేష్, ఉద్యాన శాస్త్రవేత్తలు బీఎన్.రావు, సుబ్బన్న, హేమంత్‌కుమార్, విజయకృష్ణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కూనంనేని

పర్యాటకులతో కిక్కిరిసిన కిన్నెరసాని

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా, వారంతపు సెలవులు కావడంతో కిన్నెరసాని పర్యాటకులతో కిటకిటలాడింది. శని, ఆదివారాల్లో ఏకంగా 1,350 మంది సందర్శకులొచ్చారు. వారిలో ముగ్గురు విదేశీ పర్యాటకులు ఉన్నారు. బోటు ఆదాయం రెండు రోజులకు కలిపి 57,910, టోల్‌గేట్ ద్వారా రూ.47,595 సమకూరినట్లు పర్యాటక కేంద్రం నిర్వాహకులు తెలిపారు.


జెట్టి వద్ద పర్యాటకుల సందడే.. సందడి

ఎర్రగుట్ట అటవీప్రాంతంలో పులి సంచారం?

జూలూరుపాడు: జూలూరుపాడు రేంజి ఎర్రగుట్టలో పెద్దపులి సంచరిస్తుందనే వదంతులు వినిపిస్తున్నాయి. ఎర్రగుట్ట ప్రాంతం జూలూరుపాడు, ఏన్కూరు మండలాల మధ్య ఉంది. ఓ రైతు ఇటీవల పొలం వద్ద శునకాన్ని ఉంచగా అది కనిపించకుండా పోయింది. ఇది పులి పనే అన్న ప్రచారం జరుగుతోందని ఒంటిగుడిసె రైతులు పేర్కొన్నారు. రేంజి అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ పులి సంచారం వదంతే అని అన్నారు.

నేటి నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్

ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల తలుపులు మూతపడనున్నాయి. గత మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. కళాశాలల నిర్వహణ భారమైందని, విధిలేకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉమ్మడి జిల్లా సంఘం బాధ్యులు పేర్కొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు 120 వరకు డిగ్రీ, పీజీ కళాశాలలుండేవి. ఆదరణ కొరవడటంతో మండల కేంద్రాల్లోని పలు సంస్థలను మూసివేశారు. ప్రస్తుతం కళాశాలలు సగానికి పైగా తగ్గిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న విద్యాలయాలకు ప్రభుత్వం నుంచి రీయంబర్స్‌మెంట్ సుమారు రూ.70 కోట్లకు పైగా రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే యాజమాన్య సంఘాలు తమ ఆవేదనను వెలిబుచ్చాయి. దీంతో గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో చెల్లింపులు చేస్తామని చెప్పిన ప్రభుత్వం సంబంధిత యాజమాన్యాలకు టోకెన్లు కూడా ఇచ్చింది. ఇంతలో ఎన్నికలొచ్చాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత తమ బాధలను ఉమ్మడి జిల్లాల కళాశాలల జిల్లాలకు యాజమాన్యాలు స్థానిక మంత్రులకు, జిల్లా కలెక్టర్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులకు విన్నవించారు. వారి నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో కళాశాలలను మూసివేయడమే శరణ్యమని యాజమాన్యాలు ఇటీవల తీర్మానించాయి. ఈ సమాచారాన్ని ఆదివారమే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫోన్లకు సంక్షిప్త సమాచారం రూపంలో చేరవేశాయి. కాకతీయ వర్సిటీ, రాష్ట్ర ఉన్నతాధికారులకూ విషయాన్ని చేరవేశాయి.

“గత ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలకు కొంత మొత్తం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లింపునకు టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం వాటి చెల్లింపులు చేయాలి. మిగతా మొత్తాన్ని దశలవారీగా చెల్లించాలి. ఎంతోమంది పేద విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఆధారంగా చదువు కొనసాగిస్తున్నారు. అధ్యాపకులకూ వేతనాలు చెల్లించడం లేదు.”

- మద్ది ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి ఖమ్మం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి

పొడిబారిన లక్ష్యం

● అక్కరకు రాని ఘన వ్యర్థాల సేకరణ కేంద్రాలు

కొత్తగూడెం పురపాలకంలో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం గాడి తప్పుతోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చెత్త విభజన వేరుచేసే ప్రక్రియ తూతూమంత్రంగా కొనసాగుతోంది. పర్యవేక్షణ సైతం మ.మ. అనిపిస్తుండటంతో ప్లాస్టిక్ వ్యర్థాలు దొడ్డిదారిన అమ్ముకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పాతకొత్తగూడెం, బూడిదగడ్డ ఏరియాల్లో నాలుగేళ్ల క్రితం ఘన వ్యర్థాల సేకరణ కేంద్రాలను (డీఆర్‌సీసీ) అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కోదాని ఏర్పాటుకు రూ.36 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటిల్లో పొడి (ఘన వ్యర్థాలు) చెత్తను వేరుచేసి విక్రయించడం, తడి వ్యర్థాలను వర్మి కంపోస్టుగా తయారు చేసి విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 16.10 చదరపు కిలో మీటర్లు విస్తరించి ఉన్న ప్రథమశ్రేణి ‘గూడెం’ పురపాలకంలో 36 వార్డులున్నాయి. ప్రతి వార్డు నుంచి ‘స్వచ్ఛ ఆటో’లో ఇంటింటికి చెత్త సేకరిస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. డంపింగ్ యార్డులతో పాటు డీఆర్‌సీసీ కేంద్రాలకు సుమారు 18 నుంచి 24 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 14 మెట్రిక్ టన్నుల తడి చెత్తను తరలిస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం 8 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు వెలువడుతున్నాయి. స్వచ్ఛ ఆటో కార్మికులు సేకరించే ఘన వ్యర్థాలు కిలోకు కేంద్రం వారు రూ.5 చెల్లిస్తున్నారు. తిరిగి దుకాణాలకు రెండు, మూడు రెట్లకు విక్రయిస్తున్నారు. సేకరించిన వ్యర్థాలు, ఆదాయం తాలూకు లెక్కాపత్రాల్లేకపోవడంతో నిర్వాహక సిబ్బంది పురపాలక ఖజానాకు చిల్లులు పొడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


డీఆర్‌సీసీ కేంద్రం వద్ద గుట్టగా పేరుకుపోయిన చెత్తకుప్పలు

గుట్టలుగా.. చెత్త కుప్పలు

డీఆర్‌సీసీ కేంద్రాల్లో ఏ రోజుకా రోజు ప్లాస్టిక్, ఘన వ్యర్థాలను సేకరించి మార్కెట్ రేటుకు విక్రయించడం ద్వారా పురపాలకానికి ఆదాయాన్ని పెంచాలి. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలి. కానీ, అక్కడి కంపోస్టు బెడ్లు చాలా వరకు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కేవలం రెండు, మూడింట్లో మాత్రమే వర్మికంపోస్టు తయారు చేస్తున్నారు. పట్టణ స్వచ్ఛతతో పాటు పురపాలకానికి ఆదాయ వనరుగా మారాల్సిన కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఆదాయ వివరాలను పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా డీఆర్‌సీసీలను గాడిలో పెట్టి మరికొందరికి ఉపాధి కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

“తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చిన ట్రాలీల కార్మికులకు డీఆర్‌సీసీల్లో మార్కెట్ ధరనే చెల్లిస్తున్నారు. త్వరలో రామవరంలో బయో మైనింగ్ ప్లాంట్ ప్రారంభించనున్నాం. ఇకపై ఘన వ్యర్థాలను అక్కడకు తరలించి అవకతవకల్లేకుండా విక్రయాల ఏర్పాట్లు చేస్తాం” అని పురపాలక అధికారులు ‘న్యూస్‌టుడే’కు వివరణ ఇచ్చారు.





వెండి మబ్బుల కనువిందు



నిండు కుండను తలపిస్తున్న పాలేరు జలాశయంలో మేఘాల ప్రతిబింబాలు కనువిందు చేశాయి. ఈ దృశ్యాన్ని వంతెన మీదుగా వెళ్లే వాహనదారులు కాసేపు ఆగి ఆసక్తిగా తిలకించారు. - ఈనాడు, ఖమ్మం

హంసల విన్యాసాలు అదరహో..!




కిన్నెరసాని పర్యాటక కేంద్రంలోని కొలనులో హంసలు (తెల్ల, నల్లని బాతులు) పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. వాటి విన్యాసాలను చిన్నారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. దసరా సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన పర్యాటకులు హంసల కొలను వద్ద సందడి చేశారు. - ఈనాడు ఖమ్మం, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



రావి చెట్టు.. ఏనుగు తలను పోలినట్టు

ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద రహదారి పక్క నున్న రావిచెట్టు కాండం ఏనుగు తల ఆకృతిని పోలి ఉంది. అటుగా వెళ్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా చూస్తున్నారు. - ఈనాడు, ఖమ్మం

కొబ్బరి కాయతో.. కళాకృతి..!



ఈ చిత్రాన్ని చూడండి... వృద్ధుడి బొమ్మ ఆకట్టుకునేలా ఉంది కదూ..! దీనికి ప్రత్యేకత ఉందండోయ్... దీనిని కేవలం కొబ్బరి కాయ, చిప్పలతో తయారు చేశారు. ఆ బొమ్మను శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ వద్ద జరిగిన ఆయిల్‌పాం కిసాన్‌మేళాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రదర్శించారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు. - అశ్వారావుపేట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో వక్క సాగుకు కార్యాచరణ: తుమ్మల



పోలాసిగూడెంలో వక్క తోటను పరిశీలిస్తున్న తెలంగాణ మంత్రి నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిపుణులతో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో వక్క తోటల సాగుపై తగిన కార్యాచరణ చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పోలాసిగూడెంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. గ్రామంలో సాగుచేస్తున్న వక్క, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా వక్క సాగు చేస్తున్నారని, ఇది లాభదాయకంగా ఉందని రైతులు, నిపుణులు చెబుతున్నారన్నారు. తుమ్మల వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, పోలాసిగూడెం సర్పంచి మధు తదితరులున్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అక్కాతమ్ముళ్లు..

ఉపాధ్యాయ కొలువు సాధించారు!

పాల్వంచ విద్యా విభాగం, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే



అనిత, బన్సీలాల్

స్పష్టమైన లక్ష్యం.. చెదరని సంకల్పం ఉంటేచాలు.. విజయ సాధనకు పేదరికం అడ్డే కాదని నిరూపించారు ఈ అక్కాతమ్ముళ్లు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఆర్థిక అవరోధాలను తట్టుకొని నిలబడ్డారు. కానీ, కలల కొలువైన ఉపాధ్యాయ వృత్తిలో చేరాలన్న కాంక్షను ఎక్కడా వీడలేదు. పట్టుదలతో గమ్యం వైపు అడుగులు వేశారు. అహర్నిశలు శ్రమించి చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. వారే.. ఇల్లెందు మండలం కోయతండాకు చెందిన వాంక్‌డోత్ బాలు, బుల్లి తనయ అనిత, తనయుడు బన్సీలాల్.

అక్క అనిత, తమ్ముడు బన్సీలాల్ ఇద్దరికీ వివాహాలయ్యాయి. అయినా చిన్ననాటి నుంచి కలలుగన్న ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే ఆసక్తి మాత్రం వారిలో ఏమాత్రం తగ్గలేదు. ఒకే లక్ష్యం.. అదే బాటగా నిరంతరం ముందుకు సాగారు. గతేడాది నుంచి భవిత కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో బోధన చేస్తున్నారు. వారి అన్న రవికిరణ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)గా పనిచేస్తున్నారు. ఆయన కల్పించిన భరోసా, ప్రోత్సాహంతో గత డీఎస్సీకి సిద్ధమయ్యారు. ఇటీవల వెల్లడైన ఫలితాల్లో ప్రత్యేక విభాగం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టుల్లో అనిత 17, ఆమె తమ్ముడు బన్సీలాల్ 9వ ర్యాంకు సొంతం చేసుకున్నారు.

★ "ఉద్యోగ ప్రిపరేషన్ సమయంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. నాకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అయినా నా భర్త బాలాజీ సహకారంతో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ కొలువు సాధించడం సంతోషంగా ఉంది. సన్నద్ధతను పక్కా ప్రణాళిక ప్రకారం కొనసాగించా. సబ్జెక్టు ప్రాధాన్యాంశాల వారీగా సమయం విభజించుకుని పక్కాగా చదువుకునేదాన్ని. ఇప్పటికే నేను పినపాకలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం 'ఐఈఆర్‌పీ'గా పనిచేస్తున్నా. డీఎస్సీ కొలువు రూపంలో శ్రమకు తగిన ఫలితం దక్కిందని భావిస్తున్నా. అన్నయ్య రవికిరణ్ ఇల్లెందు మండలంలో భవిత కేంద్రాల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం మరువలేను". - అనిత

★ "ఉపాధ్యాయ ఉద్యోగ విజయాన్ని సాధించడంలో అన్నయ్య రవికిరణ్ చేసిన సాయం మరువలేనిది. అక్క అనితకు, నాకు అన్ని రకాలుగా తోడుగా నిలబడ్డారు. నేను గుండాల మండలంలోని భవిత కేంద్రంలో ఏడాదిగా కాంట్రాక్టు పద్ధతిలో ఐఈఆర్‌పీగా పనిచేస్తున్నా. నాకు భార్య నగ్మా, ఒక బాబు ఉన్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై.. తాజాగా డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశా. ఇన్ని రోజుల పడిన కష్టాలకు ప్రతిఫలం దక్కిందని అనుకుంటున్నా కాస్త ఆలస్యమైనా నీరసపడొద్దు. సాధించ గల లక్ష్యాన్ని ఏర్పరచుకుని శ్రమిస్తే విజయం దరిచేరుతుందనేందుకు మేమే ఓ ఉదాహరణ." - బన్సీలాల్

15న క్రికెట్ జట్టు ఎంపికలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 15న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్ 23 క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం బాధ్యుడు ఫారుఖ్ ఖాన్ తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 23 లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును సిద్ధం చేసేందుకు 15న నిర్వహించే ఎంపికల్లో 72 మంది క్రికెటర్లను ఎంపిక చేస్తామని, వారికి ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ఖమ్మం స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ లభించే ప్రతిభ ఆధారంగా తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్‌సీఏ నిర్వహించే అండర్ 23 లీగ్స్ నవంబరు 4వ తేదీ నుంచి మెదక్, సంగారెడ్డి, వరంగల్ నగరాల్లో జరుగనున్నాయని ఆసక్తిగల క్రీడాకారులు ఖమ్మం స్టేడియంలోని హెచ్‌సీఏ నెట్స్‌లో తనను సంప్రదించాలని ఫారుఖ్ ఖాన్ కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన మొడెం వంశీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వాజేడు మండలానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మొడెం వంశీ సౌత్ ఆఫ్రికాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. సౌత్ ఆఫ్రికాలోని సన్ సిటీలో ఈనెల 4 నుంచి 13 వరకు కామన్ వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో పవర్ లిఫ్టింగ్‌లో డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్, స్క్వాడ్ విభాగాల్లో మొత్తం 677.7 బరువు ఎత్తి మూడు స్వర్ణ పతకాలు, అత్యధిక స్కోరు చేసినందుకు మరొకటి మొత్తం నాలుగు బంగారు పతకాలు సాధించాడు. గతంలో వంశీ యూరప్‌లోని మాల్టాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ దేశం తరఫున స్వర్ణ పతకాన్ని సాధించిన సంగతి తెలిసిందే. వంశీకి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లేశ్, జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డి, పలువురు క్రీడాకారులు, వివిధ సంఘాల వారు అభినందనలు తెలిపారు.

దసరా వచ్చే.. సరదాలు తెచ్చే!

అమ్మవారి విగ్రహ ఊరేగింపులు.. శివసత్తుల నృత్యాలు.. రావణాసుర వధ ఘట్టాలు.. సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ ఏడాది దసరా ఊరూరా కొత్త శోభను తెచ్చింది. శరన్నవరాత్రుల ముగింపు వేడుకల్లో భాగంగా మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. విజయ దశమి సందర్భంగా ఆలయాల్లో పూజా కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



ఖమ్మం సాంస్కృతికం: కాల్వొడ్డు మున్నేరులో అమ్మవారి విగ్రహ నిమజ్జనం



మణుగూరు పట్టణం: సింగరేణి వేడుకల్లో నృత్య ప్రదర్శన...



ఇల్లెందు గ్రామీణం: పట్టణంలో జరిగిన ఉత్సవాల్లో మిమిక్రీ కళాకారుడి ప్రదర్శన



ఇల్లెందు: పట్టణంలో 'ఈటీవీ' 'జబర్దస్త్' కళాకారులు ఇమాన్యుయేలు, నూకరాజు, ఫైమా బృందం సందడి



ఇల్లెందు గ్రామీణం: నిజాంపేట కోటమైసమ్మ ఆలయంలో...



తల్లాడ: కళాకారులతో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



ఏన్కూరు: స్థానిక కోదండ రామాలయం ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన



కారేపల్లి: ఉసిరికాయలపల్లిలో కోటమైసమ్మ జాతరలో భక్తుల కోలాహలం



ఖమ్మం సాంస్కృతికం: గుట్టలబజారు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కళాకారుల వేషధారణలు..

పండుగ వేళ.. విషాద హేల

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

పండగ పూట పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. శని, ఆదివారాల్లో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఐదురుగు మృతి చెందారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు...



కరకగూడెం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన కరకగూడెం మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాదన్నగూడెనికి చెందిన మడకం భద్రయ్య(60) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతవాడకు చెందిన హిమ్లా దేవా(27) దసరా ద్విచక్ర వాహనంపై కరకగూడెం వెళ్తున్న క్రమంలో రేగళ్ల మద్దులగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కరకగూడెం ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

కారు బోల్తాపడి ఒకరు..



కూసుమంచి, న్యూస్‌టుడే: కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డ సంఘటన ఇది.. వివరాలు పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం నగరం కస్బాబజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ వేడుకకు హాజరయ్యేందుకు ప్రైవేటు బస్సు, కారులో వెళ్లారు. తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కారులో సయ్యద్ మొయినొద్దీన్(57), అతని సోదరి హూర్ జహాన్, సమీప బంధువు మహ్మద్ అబ్దుల్ హమీద్ ఖాన్ ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ మహ్మద్ షఫీక్ అహ్మద్ అతివేగంగా నడపడంతో మునిగేపల్లి ప్రాంతంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వాహనంలో ఇరుకున్న మొయినొద్దీన్, హూర్‌జహాన్‌ను స్థానికులు, బస్సులో వెనక వచ్చిన వారి బంధువులు చాలా సేపు శ్రమించి బయటకు తీశారు. మొయినొద్దీన్ మృతి చెందగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి...



అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సర్పంచి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం పంచాయతీ సర్పంచి జగిడి బాలరాజు(34) స్వగ్రామం బర్లమడుగు నుంచి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలం నందిపాడు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం కిందపడి మృతి చెందారు. ఇతని భార్య కుక్కునూరు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు.

వాహనం అదుపు తప్పి సెక్యూరిటీ గార్డు...

కామేపల్లి, న్యూస్‌టుడే: ఇల్లెందుకు చెందిన గోకినేపల్లి శ్రీనివాస్(40) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు వెళ్లి ఖమ్మం తిరిగొస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొడుకే.. కాలయముడై..!

తాగుడుకు డబ్బివ్వలేదని తండ్రినే చంపాడు

దమ్మపేట, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసైన కొడుకు.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని గొంతు కోసి హత్యచేశాడు. పోలీసుల కథనం మేరకు.. వడ్లగూడేనికి చెందిన కంభంపాటి సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. డబ్బులివ్వాలని భార్య, కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవటంతో ఆదివారం వృద్ధుడైన తండ్రి కృష్ణయ్య(75)ను అడిగాడు. తన వద్ద లేవని ఆయన చెప్పటంతో కత్తితో తండ్రి గొంతు కోశాడు. కృష్ణయ్యను హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వివాహిత...

పినపాక: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన పినపాక మండలం జిన్నెలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఏడూళ్లబయ్యారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రజిత(25) ఇంటి ఆవరణలో ఆన్ చేసి ఉన్న వాటర్ హీటర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కిస్తీ కట్టలేక కాల్వలో దూకి ఆత్మహత్య



వెంకటనారాయణ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: నెలవారీ కిస్తీ చెల్లించలేక ఓ వ్యక్తి కాల్వలో దూకి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం ప్రకారం... వైరాకు చెందిన తాటికొండ వెంకటనారాయణ(50) నగర శివారు వైఎస్ఆర్ నగర్‌లో కొంతకాలంగా ఉంటున్నారు. వైరాలో బంధువులతో కలిసి ఆయన చీటీ వేసుకున్నారు. రెండు నెలలుగా చెల్లించకపోవడంతో వైరా నుంచి వచ్చిన బంధువులు వెంకటనారాయణ దంపతులను నిలదీశారు. బ్యాంకులో నగదు ఉన్నాయని తీసి ఇస్తానంటూ వారితో కలిసి వెంకటనారాయణ శుక్రవారం బస్సులో వైరా బయలుదేరారు. ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద ఆగిన సమయంలో బస్సు దిగిన ఆయన పరుగెత్తుకెళ్లి సాగర్ ప్రధాన కాల్వలో దూకారు. ఆయన మృతదేహాన్ని శనివారం వి.వెంకటాయపాలెం లాకుల వద్ద పోలీసులు గుర్తించారు. అన్నం శ్రీనివాసరావు బృందం వెంకటనారాయణ మృతదేహాన్ని ఒడ్డుకు తీసి ఆసుపత్రికి తరలించింది. ఆరుగురు బంధువులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

తాలిపేరులో మునిగి ఇద్దరు యువకుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: గన్నవరానికి చెందిన ఇద్దరు యువకులు తాలిపేరులో పడి మృతి చెందారు. నిమజ్జనం కోసం బతుకమ్మలను శనివారం ఊరేగింపుగా గొంపెనగూడెం వద్ద తాలిపేరు నదికి తీసుకువచ్చారు. నిమజ్జనం అనంతరం యువకులు నదిలో స్నానానికి దిగారు. జంపన్న(20), సోయం మహిధర్(17) నది లోతులోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు బయటకు తీసి చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సీపీఆర్ చేసినప్పటికీ ఆ యువకుల ప్రాణాలు దక్కలేదు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.



గట్టుపల్లి జంపన్న సోయం మహిధర్

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

వాలీబాల్ విజేతలకు బహుమతుల పంపిణీ

దమ్మపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు మండలంలోని రాచూర్‌పల్లి గ్రామంలో నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం బహుమతులు అందజేశారు. యువత ఖాళీ సమయాల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యసనాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సోయం వీరభద్రం, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నేతలకు ఆహ్వానాలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు భద్రాద్రి రామాలయం ఈఓ రమాదేవి శబరి స్మృతి యాత్రకు హాజరు కావాలని ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్యకు ఈఓ రమాదేవి ఆదివారం ఆహ్వానం పత్రిక అందజేశారు.

సమస్య: దమ్మపేట మార్కెట్ యార్డు రోడ్డు నుంచి మల్లారం మోడల్ కాలనీకి వెళ్లే రహదారిలో వీధిలైట్లు వెలగడంలేదు. ఈ దారిలో ఆయిల్‌పాం తోటలు ఉండటంతో విష కీటకాలతో రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- రామారావు, మోడల్‌కాలనీ.**

సమాధానం: మోడల్‌కాలనీ వెళ్లే దారిలో వీధిలైట్ల సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం. **- ప్రవీణ్‌కుమార్, దమ్మపేట పంచాయతీ కార్యదర్శి** - దమ్మపేట, న్యూస్‌టుడే

ఇళ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలివ్వాలి: కూనంనేని

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: సర్వే నంబరు 1228లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. పామాయిల్ పరిశ్రమ, కెమిలాయిడ్స్ అతిథిగృహం, ఏఎంసీ గోదాముల వద్ద ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారు శనివారం నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, సయ్యద్ సలీం, నరాటి ప్రసాదు, గన్నిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో ఉన్నత స్థాయికి..

వెంకటాపురం, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే సామాన్యులు సైతం ఉన్నతస్థానాలకు ఎదగొచ్చని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురంలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వెంకటాపురం ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. విజేతల జట్లకు నగదు, బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

ఆయిల్‌పాం విస్తరణకు అవగాహన సదస్సులు

ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: గ్రామగ్రామానా ఆయిల్‌పాం తోటల విస్తరణకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో జరిగిన ఆయిల్‌పాం కిసాన్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యాన ప్రదర్శనశాలను ఉద్యానశాఖ జేడీ సరోజనీదేవితో కలిసి శనివారం ప్రారంభించారు. ప్రదర్శనశాలల్లో ఆయిల్‌పాం గెలలు, ఉప ఉత్పత్తులు, నూనె, పుష్పాలు, సంకరీకరణ, మొక్కలు ప్రదర్శించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో భారీ సైజు అరటి గెలలు, పట్టుపురుగుల పెంపకం, మల్బరీ ఆకులు, గ్యాక్ ఫ్రూట్(స్వర్గ ఫలం), కోకో, వక్క, గుమ్మడి, బొప్పాయి, జామ, మునగ మొక్కలను ప్రదర్శించారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కల రకాలు, కొబ్బరిపీచు ద్వారా పలు రకాల ఆకృతులను ప్రదర్శించారు. బిందుసేద్యం పరికరాలు, ప్రదర్శించారు. రైతులు వీటిని సందర్శించి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. కొబ్బరి బోర్డు డీడీ కుమార్‌వేల్, డీహెచ్‌ఓ మధుసూదనరావు, డీఏఓ అనసూర్య, రైతు సంఘ ప్రముఖులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



మేళాలో ప్రదర్శనశాలలను ప్రారంభిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, ఉద్యానశాఖ జేడీ సరోజనీదేవి

శబరి మాత ఉత్సవానికి సంసిద్ధం

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శబరి మాత ఉత్సవాన్ని ఈనెల 17న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ వేడుకకు రావాలని ప్రముఖులకు ఈఓ రమాదేవి ఆహ్వానాలు పంపుతున్నారు. 17న ఉదయం 6.30 గంటలకు గిరిజన సంప్రదాయంలో మేళతాళాలతో గిరి ప్రదక్షిణ, 8.30కు చిత్రకూట మండపంలో నిత్య కల్యాణోత్సవం చేస్తారు. 11.30 గంటలకు ఫలపుష్ప సమర్పణ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు ప్రసాద వినియోగం చేస్తారు. అదే రోజున అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో ఉదయం 8.30 గంటలకు రామరథం శోభాయాత్రగా బయల్దేరి ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుంటుంది. సీతారాముల వారి ప్రచారమూర్తులకు అక్కడ కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న ప్రసాదం అందిస్తారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి విధులను కేటాయించారు.



ఫల పుష్పాలతో శబరి ఉత్సవం (పాత చిత్రం)

గిరిజన సంప్రదాయంలో వేడుక..


నారదుడి ఉపదేశంతో వాల్మీకి రామాయణం రాయగా.. ఈ కావ్యంలో శబరిమాత్ర పాత్ర చాలా చిన్నది. శబరిమాత శ్రీరామగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా) ప్రాంతంలో మాతంగ మహర్షి ఆశ్రమంలో నివసించింది. శ్రీరాముడు తన గురువులైన వశిష్ఠుడు, విశ్వామిత్రుడి ఆజ్ఞలు ఎలా నెరవేర్చారో.. ఆమె కూడా మాతంగ మహర్షిని గురువుగా భావించి రాముడి రాక కోసం నిరీక్షిస్తుంది. అందుకే శబరిని వాల్మీకి 'ధర్మ నిపుణ' అని ప్రస్తావించారు. ఇలాంటి మహనీయురాలు పేరిట భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో అశ్వయుజ పౌర్ణమికి గిరిజన ఆచారంలో ఉత్సవం నిర్వహించడం దశాబ్ద కాలంగా కొనసాగుతుంది.

కథ ఎవరు చెప్పినా..!

సీతారాముల కథకు వాల్మీకి రామాయణం మూలం. దీని ఆధారంగా వందకు పైగా రామాయణాలు వచ్చాయి. తెలుగులో మొల్ల రామాయణం, రంగనాథ రామయణం, భాస్కర రామాయణం, ఉత్తర రామాయణం, కట్టా వరదరాజు రామాయణం, గోపీనాథ్ రామాయణం, వాసుదాస స్వామి రామాయణం, సరస్వతీ రామాయణం, రామాయణ కల్పవృక్షం వంటివి ప్రఖ్యాతిగాంచాయి. ఇలా ప్రతిదానిలో శబరి పాత్రకు ప్రాధాన్యత కల్పించారు. బాపూ రమణీయం కలయికలో రామాయణంపై పలు సినిమాలు రాగా వాటిలో శబరి పాత్రను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

నదిగా మారి..

సీతాన్వేషణలో ఉన్న రామ లక్ష్మణులు ఆశ్రమానికి చేరగానే శబరి సంతోషించి పండ్లు రుచిగా ఉన్నాయో లేదో కొరికి ఎంగిలి పండ్లను రాముడికి ఫలహారంగా అందించించి ఆకలి తీర్చింది. రామ దర్శనంతో పునీతమైన ఆమె దేహం ద్రవించి శబరి నదిగా మారిందని భక్తుల విశ్వాసం. పచ్చని వనాల్లో రామాయణం విలసిల్లగా పర్యావరణ ప్రేమికురాలిగా శబరి పాత్రకు ప్రాధాన్యత ఉంది. జంతువుల వేటను ఆనాడే ఆమె సహించలేదని పురాణాలలో పొందుపర్చారు. శబరి జలాలు అమృతంగా భావిస్తారు.



రామయ్యకు పండ్లు అందిస్తున్న శబరిమాత

మద్యానికి బానిసై బలవన్మరణం

ములకలపల్లి, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ములకలపల్లి మండలం ముత్యాలంపాడుకు చెందిన ఊకే వెంకటకృష్ణ(35) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం మానివేయాలని, కుటుంబ పోషణ చూడాలని భార్య ఝాన్సీ రాణి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామశివారులోని పత్తిచేలో మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆళ్లపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం మనోహర్ హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. దసరా పండుగ పురస్కరించుకొని మద్యం సేవిస్తున్నాడని తల్లిదండ్రులు మందలించారు. ఆ మనస్తాపంతో మనోహర్ పురుగు మందు తాగాడు. అనంతరం స్నేహితులకు, బంధువులకు చరవాణిలో వీడియోకాల్ చేసి తెలియజేశాడు. అప్రమత్తమైన స్నేహితులు 108కు సమాచారం ఇచ్చారు. అతడికి ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం పట్టణానికి తరలించారు.

ఇద్దరు వైదిక పెద్దలకు మెమోలు జారీ?

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలోని ఇద్దరు వైదిక పెద్దలకు ఈఓ రమాదేవి ఆదివారం మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దసరా వేడుకలు జరుగుతున్న తరుణంలో ఇక్కడి ఉద్యోగులకు అధికారికంగా సెలవులు ఇవ్వడం కుదరదని ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇద్దరు వైదిక పెద్దలు సెలవు మంజూరు కాకుండా గైర్హాజరవడం చర్చకు దారి తీసింది. దీనిపై వీరిద్దరికి మెమోలు ఇచ్చి వివరణ అడిగినట్లు సమాచారం.

బాలిక నేత్రాలు దానం

దమ్మపేట, న్యూస్‌టుడే: మండలంలోని పట్వారిగూడెం వాసవీక్లబ్ అధ్యక్షుడు పరిటాల నాగచక్రధర్‌రావు కుమార్తె సౌమ్యతేజస్విని(10) ఆదివారం హృదయ సంబంధ వ్యాధితో మృతి చెందింది. బాలిక నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం అగర్వాల్ నేత్రనిధికి దానం చేశారు. బాలిక మృతి బాధను దిగమింగి, నేత్రదానానికి ముందుకొచ్చిన ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

ఆయుర్వేద మందుల పంపిణీ

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆయుర్వేద మందులు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని ఆళ్లపల్లి ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆళ్లపల్లిలో ఆదివారం ఉచిత ఆయుర్వేద మందులను వ్యాపారులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, మహమ్మద్ బాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కొండరెడ్డి మహిళలకు చీరల వితరణ

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా శనివారం మారుమూల గ్రామాల్లోని కొండరెడ్డి మహిళలకు భారాస సీనియర్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు చీరలను పంపిణీ చేశారు. రెడ్డిగూడెం, సుద్దగోతులగూడెంలోని సుమారు 150 మందికి చీరలను అందజేశారు. మాజీ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, హేమాశ్రీ, జతిన్, ధర్మారావు పాల్గొన్నారు.

'బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

బూర్గంపాడు, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్య ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి కోరారు. బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి చంద్రశేఖర చక్రవర్తి, మహ్మద్‌ఖాన్, బెల్లంకొండ వాసుదేవరావు, మందా నాగరాజు, ఇంగువ రమేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బారు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గిరిజన దర్బారు ఉంటుందని పీఓ రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల అధికారులు సకాలంలో హాజరు కావాలని, గిరిజనులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలపాలని కోరారు.

దమ్మపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-09 పూర్వవిద్యార్థుల సంఘ ఆత్మీయసమ్మేళనం పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. బాల్యమిత్రులంతా ఒకచోట చేరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. అందరూ కలసి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు చైతన్య, హరీశ్, వరప్రసాద్, మనోజ్, రమేశ్ పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆసుపత్రుల్లో ఖాళీలను భర్తీ చేయాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారుల, సిబ్బంది ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ డిమాండు చేశారు. గౌరవరంలో సీపీఎం శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు మడకం ఆదెయ్య జెండా విష్కరణ చేశారు. దుమ్ముగూడెం పీహెచ్‌సీలో రెండో వైద్యాధికారి పోస్టు భర్తీ చేయకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

'ఊచకోతకు వ్యతిరేకంగా గళమెత్తండి'

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులోని గోవాడి, బొండోస్, తుల్‌తులి అడవుల్లో ఈనెల 4న జరిగిన మావోయిస్టుల ఊచకోతకు వ్యతిరేకంగా ప్రజలు గళమెత్తాలని మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ కమిటీ పేరిట ఆదివారం లేఖ విడుదల చేశారు. ఆ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. ఎన్‌కౌంటర్లో గాయపడిన వారిని సైతం దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. అక్కడి ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూరజ్‌కుండ్-ఆపరేషన్ కగార్ దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. పేద గిరిజనులపై దమనకాండను కొనసాగిస్తున్నాయని ఆక్షేపించారు. ప్రభుత్వాల కుట్రలను అర్థం చేసుకొని అమర వీరుల ఆశయాల స్ఫూర్తితో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

పచ్చగా ఎదిగి.. ప్రకృతి ఒడిలో ఒదిగి..

పచ్చనిహారంలా మదిని దోచేలా ఎంచక్కా సాగైన వరి పంట కీకారణ్యంలో ఎంత చూడముచ్చటగా కనిపిస్తోంది. ఆ పచ్చని పంట నడుమ మోడైన చెట్టు దర్శనమిస్తున్న ఈ దృశ్యం చర్ల మండలంలోని చింతగుప్ప-దానవాయిపేట రోడ్డు మధ్యలో ఎంతో ఆహ్లాదకంగా కనిపిస్తోంది. – చర్ల, న్యూస్‌టుడే



తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం

గొందిగూడెం ఇసుక వాగులో ఎట్టకేలకు తాత్కాలికంగా పైపులు వేసి అప్రోచ్ రోడ్డును మళ్లీ నిర్మించారు. రాకపోకల సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఇంతకాలం గొందిగూడెం, కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల ప్రజలకు ఎదురైన రాకపోకల కష్టాలు దీంతో తీరినట్లైంది. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ను 'న్యూస్‌టుడే' పలకరించగా.. గుత్తేదారుతో మాట్లాడి గ్రామపెద్దలే అప్రోచ్ రహదారిని నిర్మించుకున్నారన్నారు. వంతెన నిర్మాణం విషయమై గుత్తేదారును ప్రశ్నిస్తే స్పందన ఉండటంలేదని చెప్పారు.

– అశ్వాపురం, న్యూస్‌టుడే



ఆదిశక్తికి.. భక్తజన నీరాజనం

అశ్వారావుపేట, అశ్వారావుపేట గ్రామీణం, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: విజయదశమి ముగింపు ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అశ్వారావుపేట ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మిచెట్టుకు కోర్కెల పత్రాలు కట్టి పూజలు జరిపారు. శ్రీరంగాపురంలోని శ్రీవిజయదుర్గా అమ్మవారిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినాయకపురం, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, నారాయణపురం, ఆసుపాక, గాండ్లగూడెం, తదితర గ్రామాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. అశ్వారావుపేట ఠాణాలో సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు ఆధ్వర్యంలో ఆయుధ పూజ సాగింది. ఆదివారం అమ్మవారికి విగ్రహాలకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. తీన్మార్ నృత్యాలు, కోలాటంతో యువతీ యువకులు సందడి చేశారు. దమ్మపేటలోని శ్రీవిశ్వేశ్వరస్వామి, సంతాన వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. రాచూర్‌పల్లి, పట్వారిగూడెం, లచ్చాపురం గ్రామాల్లోని బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం, చంద్రుగొండలోని భక్తాంజనేయస్వామి ఆలయాల్లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా సాగింది. అన్నపురెడ్డిపల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శమీ పూజ నిర్వహించారు. పలు గ్రామాల్లో అమ్మవారిని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ములకలపల్లి, పూసుగూడెం, జగన్నాథపురంలో అమ్మవారికి ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు.

మణుగూరు పట్టణం, మణుగూరు సాంస్కృతికం, గుండాల, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, న్యూస్‌టుడే: మణుగూరులో దసరా పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. పీవీకాలనీలోని భద్రాద్రి క్రీడా మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన దసరా సంబరాలు అంబరాన్నంటాయి. కళాకారుల నృత్యాలు అలరించాయి. రాంలీలా కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. మణుగూరు పోలీసుస్టేషన్‌లో ఆయుధ పూజలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీశ్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

✦ పీకే 1 సెంటర్ వద్ద నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

✦ అశ్వాపురంలోని కోదండరామాలయం వద్ద దుర్గాదేవి ఆదివారం మహిషాసురమర్ధనిగా భక్తులకు దర్శనమిచ్చింది. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ సుజాత అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

✦ గుండాల, కరకగూడెం, బూర్గంపాడు మండలాల వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భద్రాచలం: చెన్నైకి చెందిన మైత్రి సెంటర్ ఫర్ ఆర్ట్స్ సంస్థ తరపున కళాకారుల బృందం విజయదశమి సందర్భంగా స్వామివారి సన్నిధిలోని చిత్రకూట మండపంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

✦ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రతి విజయదశమి ఉత్సవాలకు లక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్ర పారాయణం చేస్తున్నారు. 21 సంవత్సరాలుగా దసరా సమయంలో ఈ క్రతువు సాగుతోంది. పది రోజుల పాటు సాగిన కార్యక్రమం శనివారం పూర్తయింది.

చర్ల: పాతచర్లలోని గడికోటలో శివాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణ దహనం కార్యక్రమం నిర్వహించారు. గడికోటలో ఏర్పాటు చేసిన భారీ రావణాసురుడి చిత్రపటానికి బాణంతో నిప్పింటించి దహనం చేశారు. ✦ దుర్గాదేవి అమ్మవారి శోభాయాత్ర ఆదివారం చర్లలో ఘనంగా నిర్వహించారు. అనంతరం తాలిపేరు నదిలో అమ్మవార్లను నిమజ్జనం చేశారు.



చంద్రుగొండ: దామరచర్లలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో..



కొత్తమామిళ్లవారిగూడెంలో అమ్మవారి ఊరేగింపు సందడి



పీకే-I సెంటర్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



చర్లలో రావణాసురుని ప్రతిమ దహనం



చర్ల: అమ్మవారి శోభాయాత్రలో కోలాట నృత్యం



అశ్వారావుపేట: జమ్మిచెట్టుకు కోర్కెల పత్రాలు కడుతున్న భక్తులు



భద్రాచలం: నృత్యం చేస్తున్న కళాకారులు

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు గాయాలు

కారు బోల్తా

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు మండలం గుట్టమల్లారం గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. అతణ్ని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో కారు ధ్వంసమైంది.

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు గాయాలు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి లారీ శనివారం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ప్రమోద్ కుమార్ అందులో ఇరుక్కుపోయి నరకం అనుభవించాడు. సీఐ కరుణాకర్ ఘటనాస్థలికి వెళ్లి గ్యాస్ కట్టర్లు, పొక్లెయిన్ సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీయించారు. బాధితుడికి రెండు కాళ్లు విరిగి పోవడంతో కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. జంగారెడ్డిగూడెం వెళ్తున్న మరో లారీ ఆసుపాక సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం అశోక్‌నగర్‌కాలనీ (గీతాంజలి హోటల్ వీధి)లోని బి.రామాయమ్మ అనే మహిళ ఇంటిలో ఆదివారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ పేలి రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత మహిళ ఉదయం పూజ చేసిన అనంతరం బయటకు వెళ్లింది. పూజకు వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సామాన్లకు అంటుకొని వాటి పక్కన ఉన్న గ్యాస్ సిలిండర్ వేడెక్కి పేలి ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఆస్తి నష్టం రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.



యువకుడి వేధింపులపై ఫిర్యాదు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువతిని ఓ యువకుడు మానసికంగా వేధిస్తున్న ఘటనపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రేమ పేరుతో యువకుడు కొద్ది రోజులుగా వేధిస్తున్నాడని, ఎంత చెప్పినా అతని తీరు మారడంలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్ణశాలలో రామలీలా మహోత్సవం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పర్ణశాల, నడికుడి, లక్ష్మీనగరం, సీతారాంపురం ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, శమీపూజ, జమ్మిచెట్టు పూజలు ఘనంగా నిర్వహించారు. పర్ణశాల రామాలయంలో రామలీల మహోత్సవం సాగింది. మేళతాళాలతో విశ్రాంతి మండపం వరకు తిరువీధిసేవ, శమీపూజ భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం రావణదహన కార్యక్రమం సాగింది.



స్వామివారి ఊరేగింపులో భక్తులు

శ్రీలలితా పరమేశ్వరి ఆలయంలో జడ్జిల పూజలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక శాంతినగర్‌లో కొలువై ఉన్న శ్రీలలితా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జీలు మండా వెంకటేశ్వరరావు, దేవరపల్లి నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారిని శాలువాలతో సన్మానించింది. పలువురు న్యాయవాదులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి వనాలు నిరుపయోగమేనా?

అశ్వాపురం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పిచ్చిమొక్కలు, పొదలకు ఆవాసంగా మారాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ఎవరికీ అందుబాటులో లేని ప్రాంతంలో ఏర్పాటు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. అమ్మగారిపల్లిలోని అణుశక్తి నగర్‌లో గుట్టకింద, మరొకటి అమ్మగారిపల్లి నుంచి కుమ్మరిగూడెం మార్గంలో సీతారామ ప్రధాన కాలువ మట్టి కుప్పల పక్కన ఏర్పాటు చేశారు. పూల మొక్కలన్నీ ఎండిపోగా.. మరి కొన్ని మొక్కలు చెట్లుగా మారి గుబురుగా అలముకున్నాయి. పల్లె ప్రకృతి వనం బోర్డు, ద్వారాలు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ అజర్‌ను వివరణ కోరగా.. కోనోకార్పస్ చెట్లను నరికివేశాం. నీటి సమస్య కారణంగా కొత్త మొక్కలు నాటలేదని, త్వరలోనే నాటుతామని తెలిపారు.



అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం మార్గంలో సీతారామ ప్రధాన కాలువ మట్టికుప్పల వద్ద ఉన్న పల్లె ప్రకృతి వనం

కొత్తగూడెం
•కొత్తగూడెం •ఇల్లెందు

'ప్రజా సమస్యలపై ఉద్యమిద్దాం'

టేకులపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై అన్ని పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలని టేకులపల్లి రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు కోరారు. టేకులపల్లిలో ఆదివారం భారాస, సీపీఐ, ఎన్డీ, ఎన్డీ(చంద్రన్న), మాస్‌లైన్, సేవాలాల్ సేన తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజకీయ జేఏసీ సమావేశం లక్కినేని సురేందర్‌రావు స్వగృహంలో జరిగింది. రాజకీయ ఐకాస కన్వీనర్‌గా లక్కినేని సురేందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ నాయకులు ఊక్లా, ప్రసాద్, వరప్రసాద్, సత్యనారాయణ, వీరబ్రహ్మచారి, శివనాయక్, ఈరు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు

కొత్త విద్యుత్కేంద్రం నిర్మించాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్ పాతప్లాంట్ ఓఅండ్ఎం స్థానంలో కొత్తగా ఎనిమిదో దశ కర్మాగారాన్ని 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లుగా నెలకొల్పాలని 'కొత్త ప్లాంట్ సాధన కమిటీ సభ్యుడు' మంతపూరి రాజు గౌడ్ అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు కొత్త ప్లాంట్ ఏర్పాటుపై హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు రామలింగం, డా.సుధాకర్, శివరాం ప్రసాద్, ఆచార్యులు, సాంబశివరావు, చారుగుండ్ల రమేశ్, సైదులు, కల్యాణం లక్ష్మీపతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంతపూరి రాజుగౌడ్

గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయాలి


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాలరాజు, నాయకులు

సుజాతనగర్, న్యూస్‌టుడే: పాత అంజనాపురంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న గిరిజనులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. తొలుత సీపీఎం నేత సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి రమేశ్, నాగరత్నమ్మ, కాత్రాల తిరుపతిరావు, భాస్కర్, ప్రశాంత్, జానకిరాములు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజావాణి' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10.30 గంటలకల్లా కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

నిధులన్నీ ఏమాయె పనులేమో కరవాయె ఉయ్యాలో..

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పట్టణంలో సద్దుల బతుకమ్మల నిమజ్జన వేడుకలకు పురపాలకంలో ఆధ్వర్యంలో పాత కొత్తగూడెం, రామవరం గోధుమవాగు వద్ద రెండు ఘాట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడి ఏర్పాట్లకు పురపాలక సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల్లోంచి రూ. 5.94 లక్షలను వెచ్చించాలని కొద్దిరోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ, ఘాట్‌ల వద్ద చేసిన ఏర్పాట్లను చూసి గురువారం బతుకమ్మ వేడుకలకు హాజరైన మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.లక్షల్లో ఖర్చు వెచ్చిస్తున్నామని తగిన వసతులు కల్పించకపోవడంపై పెదవి విరిచారు.


నిమజ్జనానికి కనీసం ర్యాంపు ఏర్పాటు చేయని వైనం

★ మూడో వార్డు పాతకొత్తగూడెంలోని డీఆర్‌సీసీ భవనం పక్కన బతుకమ్మ ఆడుకునేందుకు స్థలాన్ని పురపాలక కార్మికులు శుభ్రం చేశారు. కేవలం ఓ లారీ యాష్‌ను పోయించి చదును చేశారు. వాగు దగ్గర నీళ్ల వద్దకు సురక్షితంగా చేరేందుకు ర్యాంపు లేవీ ఏర్పాటు చేయలేదు.

★ రామవరం గోధుమవాగు వద్ద మాత్రం కర్రలతో బారికేడ్లు వంటివి ఏర్పాటు చేశారు. వాగు వద్ద రాకపోకలు సాగించే రోడ్డును శుభ్రం చేసి అక్కడక్కడా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వంతెన వద్ద కొన్ని స్తంభాలకు విద్యుద్దీపాలు మాత్రం ఏర్పాటు చేశారు. రెండు ఘాట్‌ల వద్ద కేవలం రహదారుల చదును, శుభ్రం, విద్యుద్దీపాల ఏర్పాటుకే సుమారు రూ.6 లక్షలు వెచ్చించారా? అనే సందేహాలు ప్రస్తుతం వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది సైతం బతుకమ్మ ఘాట్‌ల పేరుతో చేసిన వ్యయం అంశంపై పురపాలక ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆరోపణలకు దిగారు. మళ్లీ అదే తంతు ఈ ఏడాదీ పునరావృతమైందనే వాదన వినిపిస్తోంది.

★ బతుకమ్మ ఘాట్‌ల వద్ద అన్ని రకాల జాగ్రత్తల్లో భాగంగా కేటాయించిన నిధులతో పనులను పారదర్శకంగా చేయించామని కమిషనర్ శేషు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

సమస్య: సుజాతనగర్ ఎడ్లక వాగు వద్దనున్న ఎత్తిపోతల మోటారు గది చెట్ల పొదలతో అల్లుకుపోయింది. దీన్ని పరిశుభ్రం చేయాలి. - స్థానిక రైతులు



సమాధానం: చెట్ల పొదలను వెంటనే తొలగిస్తాం. - భాస్కర్, ఇరిగేషన్ డీఈ
- సుజాతనగర్, న్యూస్‌టుడే

పాల్వంచ ఒడ్డుగూడెం కాలనీలోని డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. - భాస్కర్, స్థానికుడు
✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
- పాల్వంచ, న్యూస్‌టుడే

శేషగిరిభవన్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణాలు శిథిలమయ్యాయి. మురుగంతా స్తంభిస్తోంది. కనీసం వాటిని శుభ్రం చేయించాలి. - స్థానికులు
✔ డ్రైనేజీలను పారిశుద్ధ్య కార్మికులతో వెంటనే శుభ్రం చేయిస్తాం. స్థానికులు కాలువలపై ఉన్న సిమెంటు బిళ్లలను తొలగించాలి. - వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్
- కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

దుర్గాబస్తీలోని రైలు పట్టాల ప్రాంతంలో మేజర్ డ్రైనేజీ వ్యర్థాలతో పూడుకుపోయింది. - ఓ పాఠకుడు
✔ వెంటనే కాలువను శుభ్రం చేస్తాం. - వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్
- కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

టేకులపల్లి దాసుతండా పంచాయతీలోని డంపింగ్ షెడ్ వద్ద వ్యర్థాలను ఇష్టారీతిన డంప్ చేస్తున్నారు. చేలకు వెళ్లే రహదారి ప్రక్కనే వ్యర్థాలను వేయడంతో కోతులు, కుక్కల బెడద ఎక్కువైంది. - స్థానిక రైతు
✔ పారిశుద్ధ్య కార్మికులు, జేసీబీ సహాయంతో వ్యర్థాలను యార్డు లోపలికి నెట్టిస్తాం. - ఉప్పు దీప్తి, పంచాయతీ కార్యదర్శి
- టేకులపల్లి, న్యూస్‌టుడే

వెన్నెల రేడు కాదు.. సూరీడు!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చల్లని రేడు చంద్రుడు కాదు.. మేఘావృత వాతావరణంలో దాక్కున్న సూరీడు. ఆదివారం సాయంత్రం వేళ కొత్తగూడెంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. - కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

ఐదు తరాల అనుబంధం



పండుగ వేళ అయిదు తరాలకు చెందిన వారు ఓ ఇంట సందడి చేశారు. ఈ దృశ్యం.. కొత్తగూడెం పట్టణం హనుమాన్ బస్తీలో శనివారం కనిపించింది. స్థానికురాలైన కోడిరెక్కల భద్రమ్మ(95) భర్త ముత్యాలు స్వాతంత్ర్యం రాకముందు సింగరేణిలో కార్మికుడిగా పని చేసేవారు. మూడేళ్ల క్రితం ఆయన మృతి చెందారు. భద్రమ్మకు ఒక్కగానొక్క కూతురు భూలక్ష్మి(75). ఆమె తన కుమార్తె సుగుణ(55), మనవరాలు శ్రుతి(34), ముని మనవరాలు రిషిక(9)తో కలిసి పండుగకు 'గూడెం' వచ్చారు. అయిదు తరాల అనుబంధానికి గుర్తుగా ఇలా ఫొటో దిగారు. - కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మండలంలోని జగన్నాథపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో '2007-08' బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక వేడుకల భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు నరేశ్, భాస్కర్, వినోద్, శ్రీమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. - పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శికి అభినందన

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచ మండలం నాగారం జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ బి.హరి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగారం ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. వారికి జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం అభినందనలు తెలిపారు.

క్రీడాకారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 15, 16 తేదీలలో జరగనున్న కంపెనీ స్థాయి క్రీడా పోటీలలో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం జాన్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్ క్రీడల్లో సింగరేణివ్యాప్తంగా ఆరు రీజియన్ లెవల్‌లో ఎంపికైన క్రీడాకారులకు ఇల్లెందులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇందులో రాణించిన వారు కోల్ ఇండియా లెవల్‌కు ఎంపిక అవుతారన్నారు.

చేతిపంపును బాగు చేయాలని నిరసన

సుజాతనగర్, న్యూస్‌టుడే: అంబేడ్కర్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన చేతిపంపును అధికారులు బాగు చేయించాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు వేల్పుల భాస్కర్ డిమాండ్ చేశారు. కార్యకర్తలతో కలిసి ఆదివారం చేతిపంపు వద్ద నిరసన తెలిపారు.

సీపీఎం సానుభూతిపరురాలి మృతి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెంకు చెందిన సీపీఎం సానుభూతిపరురాలు డి.ఉమాదేవి శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తదితరులు ఉమాదేవి నివాసానికి వచ్చి భౌతికకాయానికి నివాళులర్పించారు.

పలువురి నివాళి

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: టీయూడబ్ల్యూజే-143 యూనియన్ జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ(80) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. హేమచంద్రాపురంలోని నివాసంలో ఆమె మృతదేహాన్ని వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని), సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, బిక్కసాని నాగేశ్వరరావు, తూము చౌదరి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

'కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి'

టేకులపల్లి, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అనుబంధ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధారావత్ నాగేంద్రబాబు కోరారు. టేకులపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో భారాస పెద్దల నిర్వాకానికి అమాయక కానిస్టేబుల్‌ను బలి చేశారని ఆయన విమర్శించారు.

జీవితమంతా ఎర్రజెండాకే అంకితం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాలుగా విప్లవపార్టీలో పనిచేసి గద్దర్ నేతృత్వంలోని జననాట్యమండలిలో అనేక ప్రజా కళారూపాలు ప్రదర్శించిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి రడం శ్రీను శనివారం అనారోగ్యంతో ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొమరారంలో నిర్వహించిన అంత్యక్రియలో టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు, రామటెంకి అశోక్, ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, యదళ్లపల్లి సత్యం, మోకాళ్ల రమేష్, మాస్‌లైన్ నాయకులు అజ్మీర బిచ్చ ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ నాయకులు పాల్గొన్నారు.


శ్రీను


లక్ష్మీదేవిపల్లి: మొర్రేడు వాగు ఘాట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


పాల్వంచ పట్టణం: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల


రుద్రంపూర్ ఏరియాలో..

ఘనంగా విజయదశమి వేడుకలు

కొత్తగూడెం పట్టణం, లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: మేదరబస్తీ 20వ వార్డులో అమ్మవారి నవరాత్రోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ నాయకులు జేవీఎస్ చౌదరి తదితరులు పూజలు చేశారు. ★ రుద్రంపూర్ ఏరియాలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో రెండో పట్టణ సీఐ రమేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

★ చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో విజయ దశమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. లక్ష్మీదేవిపల్లి మొర్రేడువాగు సమీపంలోని భవాని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాన్ని జరిపించారు. స్థానిక ఘాట్ వద్ద శ్రీనగర్‌కాలనీ బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోనేరు పూర్ణచందర్‌రావు, కోనేరు సత్యనారాయణ(చిన్ని)ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి శమీపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పాల్వంచ పెద్దమ్మ తల్లి తొమ్మిదో రోజు శనివారం రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. విజయదశమి రోజు పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. వందల సంఖ్యలో కొత్త వాహనాలకు పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉరేగింపు నిర్వహించారు. ఈవో ఎన్.రజనీకుమారి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, శ్రీనివాసరెడ్డి, పాపారావు తదితరులు ఉన్నారు. పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చకులు నిర్వహించారు. దంపతులు అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన అమ్మవారి భక్తులు కె.చక్రధర్‌రావు-అరుణ దంపతులు రూ.1.20 లక్షల విలువైన 15 గ్రాముల బంగారు బొట్టు బిళ్లను సమర్పించారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం అందించి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాన్ని అందించారు.


లక్ష్మీదేవిపల్లిలో భవానీమాత


పాల్వంచలో రాజరాజేశ్వరిదేవి

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణంలో శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కేటీపీఎస్ విద్యుత్కేంద్రంలో ఆయుధ పూజ నిర్వహించారు.

సుజాతనగర్, న్యూస్‌టుడే: ప్రజలకు అన్ని రంగాల్లో విజయం చేకూరాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. సుజాతనగర్ సోమేశ్వరాలయంలో శనివారం జరిగిన విజయ దశమి జమ్మి పూజలో ఆయన పాల్గొన్నారు. అర్చకులు జనార్దనశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, టీపీసీసీ సభ్యులు నాగాసీతారాములు, ఏఐటీయూసీ నాయకులు బొడ్డు కేశవరావు, తాళ్లూరి పాపారావు, కె.కృష్ణ, శేషకేశవ శివప్రసాద్, వినీల్ పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం, టేకులపల్లి, న్యూస్‌టుడే: ఇల్లెందు నెం.2 బస్తీలోని శ్రీకృష్ణభజన మందిరంతోపాటు పలు ప్రాంతాల నుంచి అమ్మవారి ప్రతిమలతో రథాలు జేకే కాలనీలోని క్రీడా మైదానానికి వరుసగా తరలివచ్చాయి. ఇల్లెందులపాడు శ్రీరామమందిరం నుంచి అయోధ్య బాలరాముని విగ్రహాన్ని ప్రదర్శనగా తీసుకువచ్చారు.

★ ఇల్లెందు సింగరేణి క్రీడామైదానంలో శనివారం జరిగిన దసరా ఉత్సవాలలో వేలాదిమంది పాల్గొని వేడుకలను తిలకించారు. ★ ఇల్లెందు మండలం నిజాంపేట కోటమైసమ్మ జాతరలో శనివారం, ఆదివారం రేపల్లెవాడ, కట్టుగూడెం, నిజాంపేట గ్రామాలతోపాటు ఇల్లెందు, బయ్యారం ప్రాంతానికి చెందిన భక్తులు భారీగా పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ★ టేకులపల్లి కోదండ రామాలయం, బ్రహ్మంగారి వీధి, బోడు, తెలగూరు, కోయగూడెం ఓసీల్లో నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారి శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో మహాచండీ హోమంలో 36 మంది దంపతులు పాల్గొన్నారు. పాపకొల్లు, జూలూరుపాడు, గుండెపూడి, వెంగన్నపాలెం, కాకర్ల, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్‌లు పాల్గొన్నారు.


పాల్వంచ పట్టణం: అమ్మవారికి బంగారు బొట్టుబిళ్లను సమర్పిస్తున్న భక్తులు కె.చక్రధర్‌రావు-అరుణ దంపతులు


పాల్వంచ: బొల్లోరిగూడెంలో జమ్మి పూజ


జూలూరుపాడులో మహాచండీ హోమం

పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తుల వితరణ

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ సిబ్బందికి లయన్స్ క్లబ్ శ్రీనగర్ అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానాచార్యుడు బత్తుల కృష్ణయ్య తన భార్య సరోజిని జ్ఞాపకార్థం నూతన వస్త్రాలను ఆదివారం అందజేశారు. స్థానిక పెద్దలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు కోనేరు పూర్ణచందర్‌రావు, రమేశ్, సాంబశివరావు, శివ తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న బత్తుల కృష్ణయ్య తదితరులు

చుంచుపల్లి, న్యూస్‌టుడే: విద్యానగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం జ్యోతి అనాథ వృద్ధుల ఆశ్రమంలో నూతన వస్త్రాలను ఆదివారం పంపిణీ చేశారు. యూఎస్ఏకి చెందిన శార్వాణి, జయకృష్ణ దంపతుల వితరణతో వారి కుటుంబ సభ్యులైన సీతారామ శాస్త్రి రూ.5 వేల విలువైన దుస్తులను ఆశ్రమంలో అనాథలు, వృద్ధులకు అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు నాగేశ్వరరావు, సురేశ్, సభ్యులు పాండురంగారావు, అంజనానందం, శివరామకృష్ణ, సమ్మయ్య పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: మనస్తాపంతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది సీఐ ఎం.కరుణాకర్ కథనం ప్రకారం... పాతకొత్తగూడెం గౌతంనగర్‌కాలనీకి చెందిన ఎం.దీపక్(30)కి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లైన రెండు నెలలకే అతని భార్య విడాకులు తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అదే మనోవేదనతో మద్యానికి బానిసయ్యాడు. దీపక్ తల్లిదండ్రులు ఈనెల 10వ తేదీన ఇల్లెందు ప్రాంతంలో కోటమైసమ్మ దేవాలయానికి వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉన్న దీపక్ దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి కొడుకు ఉరేసుకున్న విషయం గుర్తించారు. దీపక్ తండ్రి లక్ష్మినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో మృతి

సుజాతనగర్, న్యూస్‌టుడే: సుజాతనగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని షేక్ జానిమియా(51) టైలర్‌గా జీవనం సాగించేవాడు. శనివారం నిద్రలోనే గుండెపోటుకు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లారు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే జానిమియా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రమాదంపై కేసు నమోదు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడుకుంటున్న పిల్లలను ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై గ్రామీణం ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. కేశవపురం గ్రామానికి చెందిన బానోతు నాను కుమార్తెలు వైష్ణవి, ధనుశ్రీలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన మౌర్యప్రతాప్ ద్విచక్రవాహనంపై వచ్చి వారిని ఢీకొట్టాడు. దీంతో గాయాలయ్యాయి. బాధితుల తండ్రి ఫిర్యాదుతో ఎస్సై సురేశ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై..

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి అదృశ్యంపై గ్రామీణం ఠాణాలో ఆదివారం కేసు నమోదైంది. రాజాపురం గ్రామానికి చెందిన మధుసూదన్ ఈనెల 10న సరకుల కోసమని ఇంటిలో నుంచి బయటకు వెళ్లారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు బంధుమిత్రుల ఇళ్లలో వెతికారు. అయినా జాడ లేకపోవడంతో ఎస్సై సురేశ్‌కు ఫిర్యాదు చేశారు.

విప్లవోద్యమానికి తీరనిలోటు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మరణం భారత విప్లవోద్యమానికి తీరనిలోటని సీపీఐఎంఎల్ ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు తెలిపారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఆదివారం సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పించారు. నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, మోహన్‌రావు, నరసింహారావు, వెంకన్న పాల్గొన్నారు. ★ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు, విప్లవోద్యమానికి తీరని లోటు అని ఎన్డీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అన్నారు. టేకులపల్లిలో ఆదివారం ఎన్డీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు రాంచందర్, వెంకట్రామ్, నరసింహారావు, వెంకన్న పాల్గొన్నారు.


ఇల్లెందులో సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎన్డీ నాయకులు మధు తదితరులు

వ్యర్థాల సేకరణ హుళక్కేనా..?

చుంచుపల్లి, న్యూస్‌టుడే

గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యంగా సెగ్రిగేషన్ షెడ్లు ఏర్పాటు చేశారు. వాటిని తనిఖీ చేసి పురోగతిని పరిశీలించాలని గత ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించింది. ప్రతి గ్రామ పంచాయతీలో పరిధిలో కంపోస్ట్ ఎరువుల తయారీని కొనసాగించాలని నిర్దేశించింది. కానీ, ప్రస్తుతం ఇదెక్కడా అమలు జరగడం లేదు.


చుంచుపల్లి మండలం విద్యానగర్‌లోని సెగ్రిగేషన్ షెడ్ దుస్థితి..

జిల్లాలోని 21 మండలాల్లో 479 పంచాయతీల్లో సంపద సృష్టి(సెగ్రిగేషన్) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' నిధులు రూ. లక్ష చొప్పున ఖర్చుచేశారు. తడి, పొడి చెత్త సేకరణకు ప్రతి ఇంటికీ ఉచితంగా ప్లాస్టిక్ బుట్టల్ని సైతం పంచాయతీల తరఫున అందజేశారు. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించడానికి ట్రాక్టర్లను సమకూర్చారు. అయినా కొన్ని పంచాయతీల్లో ఆశించిన మేర కేంద్రాలను నిర్వహించడం లేదు.

లక్ష్యం ఘనం.. ఫలితం భిన్నం

చాలాచోట్ల గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్నా.. అది తడి, పొడి వారీగా జరగడం లేదు. మొత్తం కలిపి డంపింగ్ యార్డులో కుప్పగా పోసి నిప్పంటిస్తున్నారు. వాస్తవానికి సెగ్రిగేషన్ షెడ్ల వద్ద తడి, పొడి వ్యర్థాలను వేరుగా నిల్వ చేయాలి. ప్లాస్టిక్ ఘన వ్యర్థాలను విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. కానీ, ఒకటీ అరా తప్ప అన్ని పంచాయతీల్లో ఈ ప్రయత్నం జరగడం లేదు.

"పంచాయతీ సిబ్బంది సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారు. కొన్నిచోట్ల తగిన ప్రచారం లేక వాటి విక్రయాలు చేపట్టడం లేదు. కేంద్రాల నిర్వహణను పరిశీలిస్తాం. ఎక్కడైనా నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు చేపట్టేలా చూస్తాం. అన్నిచోట్ల పూర్తిస్థాయిలో కంపోస్టు ఎరువులు తయారయ్యేలా, ఘన వ్యర్థాలు సేకరించి విక్రయించేలా చూస్తాం".
- చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి